క్లుప్తంగా

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

కర్నూలు (టౌన్) : క్రోధినామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ ఆకాంక్షించారు. నేడు ఉగాది పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు, పార్టీశ్రేణులకు సోమవారం ఆమె ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

ఐఎంఏ కర్నూలు శాఖ నూతన కమిటీ ఎన్నిక

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కర్నూలు శాఖ నూతన కమిటీ ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా డాక్టర్ కె. రామచంద్రనాయుడు, కార్యదర్శిగా డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, కోశాధికారిగా, ఉమెన్స్ వింగ్ చైర్మన్‌గా డాక్టర్ మాధవీశ్యామల, ఉమెన్స్ వింగ్ కార్యదర్శిగా డాక్టర్ విష్ణుప్రియ, ట్రెజరర్‌గా డాక్టర్ లక్ష్మీబాయి ఎన్నికయ్యారు.

ఇంటి పన్ను చెల్లించండి

కర్నూలు (టౌన్) : ఈ నెలాఖరు లోపు 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏక మొత్తంలో ఆస్తి పన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవుదినాల్లో సైతం ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయని, పన్ను దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

సత్యనారాయణమ్మ నియామకంపై హర్షం

కర్నూలు(అర్బన్): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా ఎక్స్ సర్వీస్‌మెన్ గడ్డం రామకృష్ణ సతీమణి, 25వ వార్డు కార్పొరేటర్ సిట్రా సత్యనారాయణమ్మను నియమించడంపై జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. సోమవారం సంఘం జిల్లా అధ్యక్షుడు నర్రా పేరయ్య చౌదరి ఆధ్వర్యంలో పలువురు సంఘం నేతలు ఆమె నివాసానికి వెళ్లి శాలువా కప్పి, పూల బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి నజీర్ అహమ్మద్, సంఘం నాయకులు మనోహర్‌రాజు, మునీర్‌సాబ్, భాస్కర్‌రెడ్డి, వరప్రసాద్, తిరుమలేశ్వరరెడ్డి, ఫక్రుద్దీన్ తదితరులు ఉన్నారు.

రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు

కర్నూలు (టౌన్) : నగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ తండ్రి మొయిజ్ ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ హాజరయ్యారు. ముస్లింలతో కలిసి దువా చేసి విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మతసామరస్యం పాటించండి


మాట్లాడుతున్న డీఎస్పీ విజయశేఖర్

కర్నూలు: హిందూ ముస్లిం అనే తారతమ్యం లేకుండా అందరూ మతసామరస్యాన్ని పాటించాలని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ సూచించారు. రంజాన్, ఉగాది పండుగలు వరుసగా వచ్చిన నేపథ్యంలో సోమవారం పాతబస్తీలోని లక్ష్మీనరసింహ కల్యాణ మండపంలో ఒకటో పట్టణ సీఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, టూటౌన్ సీఐ ఇంతియాజ్ బాషా పాల్గొని ప్రసంగించారు. పాతబస్తీలోని హిందూ, ముస్లిం మత పెద్దలు సమావేశానికి హాజరయ్యారు. ఎవరైనా అశాంతిని రేకెత్తించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కరోనా సమయంలో టీజీ కుటుంబం ఎక్కడ?

- ఎన్నికల ప్రచారంలో బీవై రామయ్య, ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి


ఓటు వేయాలని మహిళను అభ్యర్థిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ

కర్నూలు (టౌన్): ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడటంతో ఓట్ల కోసం బయటకు వస్తున్న టీజీ కుటుంబం కరోనా సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎక్కడుందని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఓట్ల సమయంలోనే వారికి ప్రజలు గుర్తుకు వస్తారని విమర్శించారు. సోమవారం రాత్రి స్థానిక 1వ వార్డు పరిధిలోని ఖండేరి వీధిలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి జగనన్న సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనించాలన్నారు. గతంలో పేద, బడుగు, బలహీన వర్గాలను తెలుగుదేశం ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆ పార్టీ నాయకులు ఇళ్ల వద్దకు వస్తే నిలదీయాలని ప్రజలకు సూచించారు. 58 నెలల జగనన్న పాలనలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. మరింత మంచి జరగాలంటే మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దయ్య, కార్పొరేటర్లు షాషావలి, మాజీ కార్పొరేటర్ శ్రీరాములు, తిరుమలేశ్వర్ రెడ్డి, బీసీ సంఘం నాయకులు ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు

ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఏపీ నూర్ బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్ అహమ్మద్ అన్నారు. కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌ను దూదేకుల సంఘం తరఫున సత్కరించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలోనే ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. దూదేకుల సంఘం తమకు మద్దతు ఇవ్వడం సంతోషంగా ఉందని పార్టీ అభ్యర్థులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి తరలివచ్చిన దూదేకుల సంఘం నాయకులతో పాటు రాష్ట్ర దూదేకుల సంఘం కార్యదర్శి సలీం, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు డి. మస్తానమ్మ, ఉపాధ్యక్షులు హుసేనమ్మ, కర్నూలు, నంద్యాల జిల్లాల దూదేకుల సంఘం జిల్లా నాయకులు గోకారి, నాగరాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

కర్నూలు (టౌన్): ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం ఓటర్లకు అవగాహన కల్పించేందుకు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మహావీర్ సర్కిల్, పాత కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, జిల్లా పరిషత్, రాజ్‌విహార్, గౌరిగోపాల్, మెడికల్ కళాశాల, ప్రభుత్వ హాస్పిటల్ , గాయత్రీ ఎస్టేట్, సి.క్యాంపు మీదుగా ద్విచక్ర వాహనాలు, చెత్త సేకరణ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని ఇప్పటికే కళాజాత బృందాలతో చైతన్యం కలిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వరరెడ్డి, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఓటేయండి

- వైఎస్సార్‌సీపీ పాలనలో చేకూరిన మేలును మరువొద్దు
- ఎన్నికల ప్రచారంలో పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనేత కాటసాని శివనరసింహారెడ్డి

కల్లూరు: ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆ పార్టీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 37వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు ఓటుతో గుణపాఠం చెప్పాలని కోరారు. టీడీపీ గత పాలనకు.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య గల తేడాను గమనించాలన్నారు. ఈ 58 నెలలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ప్రతి కుటుంబం గుర్తు చేసుకోవాలన్నారు. సంక్షమాన్ని ఆయన ఇంటి ముగింటకే తెచ్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలా పనిచేయలేదన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా స్థానికంగానే అన్ని రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నారమన్నారు. త్వరలో సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టో విడుదల చేస్తారని, అందులో రెట్టింపు సంక్షేమం ఉంటుందన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి 600కు పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశాయని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూడా ఆ పార్టీలు మళ్లీ జతకట్టాయని, నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆయిషా సిద్ధిఖా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కల్లూరు అర్బన్ 30, 31వ వార్డులలోని శరీన్‌నగర్‌కు చెందిన దాదాపు 35 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం రాత్రి ఎమ్మెల్యే స్వగృహంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి టీడీపీ శ్రేణులకు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాంబాబు, సాయన్న, హనుమంతు, మధు, సురేష్, బాలాజీ, వెంకటేష్, చిన్న, రఫీ, అయస్వామి, లక్ష్మన్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో బోయ శివ, వార్డులోని నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త పడాలి

కర్నూలు(హాస్పిటల్): ఆర్టీసీ ప్రయాణికులు వడదెబ్బకు గురిగాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్ఈఈఓ శ్రీనివాసులు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఈఈఓ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలం మొదలై ఉష్ణోగ్రత పెరిగినందు వల్ల ప్రజలు వడదెబ్బకు, డీ హైడ్రేషన్‌కు గురిగాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

జి.పుల్లయ్య కాలేజీ విద్యార్థుల ప్రతిభ

కర్నూలు సిటీ: నగర శివారులోని జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ఎంబీఏ విద్యార్థులు కేవీ సుబ్బారెడ్డి స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ వారు నిర్వహించిన నేషనల్ లెవెల్ మేనేజ్‌మెంట్ మీట్ ఉన్నతి-2024లో ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆ కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.సి శ్రీనివాసరావు పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. నేషనల్ లెవెల్ మేనేజ్‌మెంట్ మీట్ ఉన్నతి-2024 పోటీలలో హెచ్.ఆర్ యాక్టివిటీలో మొదటి బహుమతి టి.శ్రావణి, కె.ప్రీతి, ఎం.పల్లవి అందుకున్నారన్నారు. ఫైనాన్స్ యాక్టివిటీలో రెండో బహుమతిని ఎం.డి బుష్రా, మహీన్ చాందిని బేగం అందుకున్నారని, మిస్ ఉన్నతి లో మొదటి బహుమతి టి.ఈశా గెలిచారన్నారు. కార్యక్రమంలో కాలేజీ డీన్ అడ్మిన్ డా.ఎం గిరిధర్ కుమార్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్లపై సీరియస్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కొందరు జనరల్ సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయకపోవడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సీరియస్ అయ్యారు. సోమవారం ఆయన ఆసుపత్రిలోని జనరల్ సర్జరీ విభాగంలో సమీక్ష నిర్వహించారు. ఆ విభాగం కనబరిచిన ప్రతిభ, వైద్యుల హాజరు గురించి ఆయన ఆరా తీశారు. ఇప్పటి వరకు జరిగిన మేజర్, మైనర్ ఆపరేషన్ల గురించి చర్చించారు. ఆ విభాగానికి అవసరమైన పరికరాలు, వసతులు, మౌలిక సదుపాయాల గురించి వివరాలు కోరారు. సమావేశంలో సర్జరీ ప్రొఫెసర్లు డాక్టర్ హరిచరణ్, డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ మాధవీశ్యామల, డాక్టర్ రామకృష్ణనాయక్ పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం వాయిదా వేయండి

కర్నూలు(అగ్రికల్చర్): రంజాన్ పండుగ ఈ నెల 10,11 తేదీల్లో ఉండే అవకాశం ఉన్నందున ఎన్నికలకు సంబంధించి పీఓ, ఏపీఓ, ఓపీఓ శిక్షణా కార్యక్రమాన్ని మార్పు చేయాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌బాష కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలసి వినతి పత్రం సమర్పించారు. నెలవంకను బట్టి 10 లేదా 11 తేదీల్లో రంజాన్ ఉంటుందని, ముస్లింలకు ఇది అతి పెద్ద పండుగైనందున ఈ తేదీల్లో శిక్షణ కార్యక్రమం పెడితే ముస్లిం ఉద్యోగులకు అసౌకర్యంగా ఉంటుందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారని, పండుగ బుధవారం ఉంటే ఆ రోజు శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

14న రాజ్యాంగ పరిరక్షణపై కవి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14వ తేదీన 'రాజ్యాంగ పరిరక్షణ' అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్థానిక సీక్యాంప్ సెంటర్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో సాయంత్రం 5:30 గంటలకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనదలచిన కవులు తమ పేర్లను 99633 50973, 8790257601 నంబర్ల ద్వారా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కవిత చదివిన ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రం అందిస్తామని పేర్కొన్నారు.

21న చిత్రలేఖన పోటీలు

కర్నూలు కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21వ తేదీ ఉదయం 9 గంటలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ అడిషన్ క్యాబినెట్ సెక్రటరీ, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్' అనే అంశంపై 4 - 10 సంవత్సరాల లోపు చిన్నారులు సబ్ జూనియర్స్ గాను, 11 నుంచి 15 సంవత్సరాల లోపు వారిని జూనియర్స్ గాను, 15 సంవత్సరాలకు పైబడిన వారిని సీనియర్స్ గా పరిగణిస్తామని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతితో పాటు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు వివరాలకు సెల్: 9396861306 సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ఉగాది సంబరాలు

కర్నూలు కల్చరల్: క్రోధినామ ఉగాది సంబరాలను స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. సోమవారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు కృష్ణ బృందంచే నాదస్వర కచేరి, కొత్తపేట ఆంజనేయ స్వామి ఆలయం పండితులు భానుస్వామితో పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. ప్రముఖ కవులచే ఉగాది ప్రాశస్త్యంపై కవి సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. శ్రీకృష్ణార్జునీయం పద్య నాటకం ప్రదర్శించిన 8వ మంది కళాకారులు, కుటుంబ సభ్యులకు సన్మానం ఉంటుందన్నారు. సంగీతం, నాటకం, ఆహార్యం విభాగాల్లో ఉత్తమంగా రాణిస్తున్న 10 మంది కళాకారులు ఒక్కొక్కరికి రూ.2500 నగదు ప్రోత్సాహంతో పాటు ఉగాది సత్కారం ఉంటుందన్నారు.